క్లుప్తంగా

నేడు శ్రీసాంబ శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ సాంబశివుడు

డోన్ టౌన్ : ఈశ్వరుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం ఆగమనం సందర్భంగా పట్టణంలోని శ్రీసాంబ శివాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కళ్ళె శేషావలి శర్మ తెలిపారు. కైలాసాధిపతియైన పరమేశ్వరునికి వేకువ జామున 5గంటల నుంచి పంచామృత, జల, రుద్ర, బిల్వ, సుగంధ ద్రవ్యములు, హరిద్రోదక, కుంకుమ, తిలాక్షలతో అభిషేకం తదితర పూజలు ఉంటాయన్నారు. కార్తీక మాసంలో వచ్చు ఈ పర్వ దినంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని దీవెనలు పొందాలని సూచించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్న శాంతి బదిలీపై వెళ్లిపోయారు. ఆమె స్థానంలో డాక్టర్ భార్గవి ని నియమించారు. ఈ మేరకు బుధవారం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డిని ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ వైద్యురాలికి సూచించారు.

దోభీ ఘాట్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమశేఖర్‌రెడ్డి

కొలిమిగుండ్ల: నాయినపల్లె–పెట్నికోట గ్రామాల మధ్యనున్న వాగు సమీపంలో దోబీ ఘాట్ నిర్మాణానికి బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యంతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమశేఖర్‌రెడ్డి భూమి పూజ చేశారు. రజకుల సౌకర్యార్థం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రూ.10 లక్షలు డీఎంఎఫ్ నిధులను మంజూరు చేయించారు. ఈ మేరకు భూమి పూజ అనంతరం ప్రొక్లెయినర్‌తో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఆంజనేయరెడ్డి, విశ్వనాథరెడ్డి, రజకులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

బేతంచెర్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరానికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం అయిందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరి బాబు తెలిపారు. పోటీలకు గ్రామీణ, వార్డు, మండల, నియోజకవర్గ, రాష్ట్ర స్థాయిలలో డిసెంబర్ 15 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లో పోటీలు జరుగుతాయన్నారు. 15 సంవత్సరాలు పైబడిన యువతి, యువకులు వెబ్‌సైట్, యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యానికి పెద్ద పీట వేశాయని వైఎస్సార్ సీపీ నాయకులు అజామ్, శేఖర్ రెడ్డి, జశ్వంత్ రెడ్డి, సలీమ్, డక్కి శేఖర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని 2వ సచివాలయం పరిధిలో ఏఎన్ఎం మునేశ్వరి ఆధ్వర్యంలో ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఆరోగ్య శ్రీ యాప్, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.



నందివర్గం: సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం



బనగానపల్లె : సచివాలయం-5 వద్ద వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ప్రజలకు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కోవెలకుంట్ల: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు



బేతంచెర్ల : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

పేదల అభివృద్ధికి జగనే మళ్లీ సీఎం కావాలి

డోన్ టౌన్: పేదలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 2,3,4 వార్డులకు సంబంధించి కురుకుంద కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కురుకుంద హరి, వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సిలర్‌లు పూజారి వెంకటేశ్వరమ్మ, బద్దల సుబ్బులక్ష్మీ, దారా హరినాథ్‌రెడ్డి, ఆర్ట్ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు వంశీకృష్ణ, బద్దల హరి, కుళ్లాయప్ప, సచివాలయ కన్వీనర్లు శ్రీను, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పాలన ప్రభుత్వ లక్ష్యం

బేతంచెర్ల: ప్రజల వద్దకే పాలన ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం సచివాలయం -1 పరిధిలో పల్లెకు పోదాం, ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరి బాబు, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్, సర్పంచ్ గుమ్మ గాల్ల రాజు, ఉప సర్పంచ్ సత్యం రెడ్డి, ఎంపీటీసీలు నాగశేషు, వెంకట సుబ్బమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు చేకూరిని సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించిన వివరాల రూ. 28,25 కోట్ల బోర్డును ఎంపీపీ, చైర్మన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు గూని నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, తిమోతి, మోహన్ రెడ్డి, ఎద్దులన్న పాల్గొన్నారు.



డోన్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్



కొలిమిగుండ్ల : జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుర్విరెడ్డి

వైఎస్సార్‌సీపీలోనే అన్ని వర్గాలకు న్యాయం

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెట్నికోట గ్రామ సచివాలయం ఆవరణలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల బోర్డుతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పెట్నికోటలో ప్రజలకు ప్రత్యక్ష్యంగా పరోక్షంగా రూ.26 కోట్ల లబ్ధిజరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రమోహన్, రామిరెడ్డి, పుల్లన్న, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

ప్యాపిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నారని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బొర్రా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నా రు. మండల పరిధిలోని నేరేడుచెర్ల గ్రామంలో బుధవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సచివాలయం ఆవరణలో సర్పంచ్ అనిల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి, కొమ్మేమర్రి సర్పంచ్ దస్తగిరమ్మ, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరెడ్డి, మధుబాయి, చంద్రశేఖర్ రెడ్డి, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు మళ్లీ జగన్ కావాలి

కోవెలకుంట్ల: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్ అన్నారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని 1వ గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గడ్డం వర ప్రసాదరెడ్డి తదితరులు ముందుగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వెల్లడించారు. ఎంపీడీఓ సయ్యదున్నీసా మాట్లాడుతూ సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ. 14.75 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 6.07 కోట్లు, వివిధ అభివృద్ధి పనులకు రూ. 7.41 వెచ్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓ గోపినాథ్, పార్టీ నాయకులు గజ్జెలరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆదర్శంగా సంక్షేమ పథకాలు అమలు

బనగానపల్లె : దేశంలో ఏ రాష్ట్రంలో అమలుకాని విధంగా ఆదర్శంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నందివర్గం గ్రామంలో సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. సచివాలయంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీతో పాటు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నారాయణ. ఈఓఆర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం–5 పరిధిలో...

బనగానపల్లె పట్టణంలోని ఐదవ సచివాలయం వద్ద పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సచివాలయంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీ, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అబ్దుల్‌ఫైజ్ డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, వార్డు సభ్యులు సురేష్ కృష్ణ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం

డోన్: పట్టణాభివృద్ధే లక్ష్యంగా కొత్తగా రోడ్ల వెడల్పు, సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని ప్రాంతాల నందు ప్రమాదకర స్థాయిలో ఉన్న పాత విద్యుత్ స్థంభాల స్థానంలో కొత్త స్థంభాలను ఏర్పాటుచేస్తున్నామని సభ్యులకు వివరించారు. ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన తీర్మానానికి కౌన్సిలర్లందరూ ఆమోదం తెలిపారు. క్రికెట్ ప్రాక్టీస్ కోసం కొత్త బస్టాండ్ వెనకాల నెట్‌ను ఏర్పాటు చేసి క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు చైర్మన్ రాజేష్ పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డీఈ రసూల్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సప్తశైల రాజేష్



అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన దృశ్యం



స్వాములకు భిక్ష వడ్డిస్తున్న కాటసాని ప్రసాదరెడ్డి

అయ్యప్పస్వాములకు భిక్ష

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కనకాద్రిపల్లెలోని అయ్యప్ప స్వాములకు బుధవారం గ్రామానికి చెందిన అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీఆర్ రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వీఆర్ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, ఉపసర్పంచ్ లక్ష్మన్న, గురుస్వామి చంద్రమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం మధ్యాహ్నం అయ్యప్ప స్వామి దీక్షాపరులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోదరుడు, నియోజకవర్గ సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ప్రసాదరెడ్డి భిక్షను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి మాలధారులు, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, పీసీ పుల్లయ్య, వేను గోపాల్‌రెడ్డి మారుతి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలు, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలావీరభద్రస్వామి వారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

అదనంగా ఉపాధి హామీ పనులు

బేతంచెర్ల: కరువు మండలంగా బేతంచెర్లను గుర్తించినందున కూలీలకు అదనంగా 50 రోజుల ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ దస్తగిరి బాబు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో ఉపాధి హామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. 2024–25 సంవత్సరానికి మండలంలో సుమారు 1,000 ఫారంపండ్స్, 5 అమృత సరోవర్ కుంటలు, 100 మినీ అమృత్ సరోవర్ కుంటలు, 300 ఎకరాల పండ్లతోటల పెంపకం పనులను గుర్తించాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ దస్తగిరి బాబు

న్యాయం చేయండి

డోన్ రూరల్ : వారసత్వంగా సంక్రమించిన తమ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని దొరపల్లి గ్రామానికి చెందిన కున్నూరు మహేంద్ర కోరారు. 34సెంట్లులో ఐదు సెంట్లను ఓ వ్యక్తి ఆక్రమించుకుంటున్నాడని, ఈ విషయపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా నిర్మాణాలు చేపట్టేందుకు ఇసుక, ఇటుక తదితర సామగ్రిని స్థలం వద్దకు తరలించాడని, ఇరువురి రికార్డులను పరిశీలించి న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు శివరామ్, నక్కి శ్రీకాంత్, కొయిలకొండ నాగరాజులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకట్రామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్మికులకు వీకేఆర్ కాంట్రాక్ట్ ఏజెన్సీ నుంచి రావల్సిన ప్రావిడెంట్ ఫండ్ బకాయిలు, అలవెన్సులు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు కుల్లాయప్ప, పెద్ద ఎల్లయ్య, గోవిందు, యేసు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: పట్టణంలోని ఆసర్ పేట కాలనీకి చెందిన షేక్ మా బాషా అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం సచివాలయాల టౌన్ కన్వీనర్ ఆజాం బాషా, మాజీ వార్డు సభ్యులు సలీం, వెల్ఫేర్ అసిస్టెంట్ నరేంద్ర వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను మృతుని భార్య షేక్ మహబూబ్‌బీకి అందజేశారు.

పుస్తకాలు పంపిణీ

బేతంచెర్ల: పట్టణంలోని నంద్యాల రహదారిలోని అన్నపూర్ణ అనాథ ఆశ్రమం విద్యార్థులకు స్నేహితుని జ్ఞాపకార్థం తోటిమిత్రులు పుస్తకాలను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన కార్పెంటర్ దస్తగిరి జ్ఞాపకార్థం తోటి మిత్రులు తిరుమలేష్, స్వామినాథ్, వెంకటేశ్వర్లు, జాఫర్, కాజా, గౌండ పక్రుద్దీన్, ప్రేమ్ సహకారంతో ఆశ్రమం విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో గురువారం గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కర్నూలు రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు దాతల నుంచి రక్తం సేకరిస్తారని చెప్పారు. యువతతో పాటు ప్రజలు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

బడిబాటను విజయవంతం చేద్దాం

కోవెలకుంట్ల: బడిబయటి ఉన్న 6–18 సంవత్సరాల్లో పుపిల్లలను బడుల్లో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాటను విజయవంతం చేయాలని ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడికి పంపించాలి

బేతంచెర్ల: బడి ఈడు పిల్లలను బడికి పంపించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల నుంచి ఎంఈఓ సోమశేఖర్, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, చదువు నేర్చుకో నీ తలరాతను మార్చుకో నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మధ్యలో బడిమానివేసిన విద్యార్థులను పాఠశాల్లో చేర్పించాలని వలంటీర్లు, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్‌కు ఎంఈఓ సూచించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్యాపిలి: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం సరళాదేవి అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలన్నారు. ఈ వయసు పిల్లలతో పని చేయించుకోవడం నేరం అన్నారు. పేద కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత విద్య, యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం ఉచితంగా ఇస్తోందన్నారు. బడికి వచ్చే పిల్లలకు అమ్మ ఒడి పేరిట రూ. 15 వేలు నగదు తల్లి ఖాతాల్లోకి జమ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు విజయలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, చంద్రవతి, జయలక్ష్మి, సోమ్లీబాయి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు ప్రారంభమైనా చేరని సిబ్బంది

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని రెండు గ్రామ సచివాలయాలు ప్రారంభోత్సవం పూర్తయ్యింది. నెలలు గడుస్తున్నా అందులో సచివాలయ ఉద్యోగులు చేరడం లేదు. దీంతో ఎందుకిలా జరుగుతుందనే ప్రశ్నలు మొదలయ్యాయి. జూన్ 28న రెండు సచివాలయాలు ప్రారంభమయ్యాయి. ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఒకటో సచివాలయం, ఆర్టీసీ బస్టాండ్ పక్కనే రెండో సచివాలయం ఏర్పాటు చేశారు. నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసినా ఉద్యోగులు అడుగుపెట్టలేదు. బస్టాండ్ పక్కన ఉన్న సచివాలయం ముందు భాగంలో వ్యాపారులు తిష్టవేసి తోపుడు బండ్లపై యథేచ్ఛగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రం చేయడంతో పాటు అక్కడే చెత్తను పోగు చేసి నిప్పు పెడుతున్నారు. ప్రస్తుతం రెండు సచివాలయాలకు చెందిన ఉద్యోగులు ఎంపీడీఓ కార్యాలయం పక్కనే ఉన్న గెస్ట్‌హౌస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రెండో సచివాలయం పరిధిలో కొలిమిగుండ్లలో కొంత భాగంతో పాటు మీర్జాపురం గ్రామం ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకొని నూతన గ్రామ సచివాలయ భవనాల్లోకి ఉద్యోగులు చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సచివాలయం ఎదుట వ్యాపారులు తిష్టవేసిన దృశ్యం

నేడు మంచినీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : నీటి శుద్ధి కేంద్రంలో క్లారీ ఫాక్యులేటర్‌ని శుభ్రం చేయిస్తున్నందున గురువారం పట్టణంలో మంచినీటి సరఫరా అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని, డిసెంబరు 1వ తేదీ శుక్రవారం మంచినీటి సరఫరాను తిరిగి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

రేపటి నుంచి గడపగడపకు మన ప్రభుత్వం

అవుకు: మండల కేంద్రం అవుకు–3 గ్రామ సచివాలయ పరిధిలో డిసెంబర్ 1, 2వ తేదీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఉదయం 9గంటలకు ప్రారంభమై రాత్రి 8గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు. అదేవిధంగా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కన్వీనర్లు, సభ్యులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరు కావాలని కోరారు.